# ప్రజాజ్యోతి
కామారెడ్డి నిజామాబాద్
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025 । పేజీలు: 5


### తాండూర్ శివారులోని
## అటవీప్రాంతంలో అగ్నిప్రమాదం

నాగిరెడ్డిపేట్ ఫిబ్రవరి 20(ప్రజాజ్యోతి): నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ గ్రామ శివారులోని అటవీప్రాంతంలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి నీలగిరి చెట్లు దగ్ధమయ్యాయి. వందలాది ఎకరాల్లో గల నీలగిరి (యూకలిప్టస్) చెట్లు చాలావరకు కాలిపోయాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు డిఆర్వో రవికుమార్, బీట్ ఆఫీసర్ నవీన్ లు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేప్రయత్నం చేశారు.ఫైర్ స్టేషన్ కు సమాచారం ఇచ్చిన ఫైర్ ఇంజిన్ ప్రమాద స్థలానికి చేరుకుని అవకాశం లేదని సిబ్బందితో మంటలు ఇతర ప్రాంతానికి చేరకుండా ప్రయత్నం చేసినట్టు డిఆర్వో తెలిపారు.



### పంటల క్రయవిక్రయాలను
# నిశితంగా పర్యవేక్షించాలి

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**
**రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశం**



ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి: నిజామాబాద్, ఫిబ్రవరి 20 : ఎర్రజొన్న, తెల్లజొన్న, పసుపు పంటల అమ్మకాలు ప్రారంభం అయినందున క్రయవిక్రయాలను నిశితంగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. పంట దిగుబడులను

..మిగతా 2లో



### కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు
### మహేష్ కుమార్ గౌడ్‌కు
# సన్మానం

రామారెడ్డి ఫిబ్రవరి 20 (ప్రజా జ్యోతి) కామారెడ్డి జిల్లా విచ్చేసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి జిల్లా గ్రంధాల చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి,కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గిరెడ్డి మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజేందర్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం లో భాగంగా ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి నీ గెలిపించాలని కార్యకర్తల కు దిశా నిర్దేశం చేయడం జరిగింది.సందర్భంగా వారికి సన్మానం చేశారు.

## కాంగ్రెస్ అబద్ధపు హామీలతో
# ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు



### ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధపు 6 గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సంధర్భంగా గురువారం నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం లోని పాటీదర్ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఉపాధ్యాయ, పట్టభద్రులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తానన్న నిరుద్యోగ భృతి 3000 రూపాయలు, 1 లక్ష ఉద్యోగాలు ఇవ్వకపోగా ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా ఇచ్చిన హామీలో భాగంగా నిరుద్యోగ భృతిని 3000 రూపాయల నుండి నుండి

..మిగతా 2లో

# పంటల క్రయవిక్రయాలను నిశితంగా పర్యవేక్షించాలి





**మొదటి పేజీ తరువాయి...**

విక్రయించే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రేడర్లు, సీడ్ వ్యాపారులు మార్కెట్ రేటుకు అనుగుణంగా ధరను చెల్లిస్తూ, రైతుల వద్ద నుండి పంటను సేకరించేలా చూడాలన్నారు. జొన్న, పసుపు పంటల దిగుబడులు చేతికందుతున్న నేపథ్యంలో, గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి కలెక్టర్ వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు, ట్రేడర్లు, విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత సీజన్ లో సాగు చేసిన జొన్న, పసుపు పంటల విస్తీర్ణం, పంట దిగుబడులు, ఎర్రజొన్న రైతులతో ఆయా కంపెనీల వ్యాపారులు కుదుర్చుకున్న ఒప్పందం, స్వేచ్ఛ విఫణిలో ఆయా పంటలకు లభిస్తున్న ధర, మార్కెట్ డిమాండ్ తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులతో కుదుర్చుకున్న బైబ్యాక్ ఒప్పందానికి కట్టుబడి తెల్లజొన్న, ఎర్రజొన్న కొనుగోళ్లు జరగాలని, రైతులు బయట మార్కెట్లో ఎక్కువ ధరకు ఇతర ట్రేడర్లకు పంట అమ్ముకోవాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని ఈ సందర్భంగా కలెక్టర్ సీడ్ వ్యాపారులకు సూచించారు. మార్చి నెల 15వ తేదీ వరకు మార్కెట్ కు జొన్న, పసుపు పంట దిగుబడులు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా సాఫీగా క్రయవిక్రయాలు జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పసుపు పంటను బాగా ఆరబెట్టి తీసుకుని వచ్చేలా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, తద్వారా పూర్తిస్థాయిలో వారు మార్కెట్ డిమాండ్ మేరకు ధర పొందవచ్చని అన్నారు. తేమ శాతం కారణంగా రైతులు నష్టపోకూడదని సూచించారు. మార్కెట్ యార్డుకు పసుపు నిల్వలను రైతులు తీసుకువచ్చిన వెంటనే జాప్యానికి తావులేకుండా వెంటదివెంట తూకం జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. డైరెక్ట్ పర్చేస్ సెంటర్ ల ద్వారా రైతులు పంటలు విక్రయించేలా చూడాలన్నారు. క్రయవిక్రయాలకు సంబంధించి ఇది ఎంతో కీలక సమయం అయినందున జాగరూకతతో విధులు నిర్వర్తించాలని, ఏ దశలోనూ రైతులు నష్టపోకుండా, ఇబ్బందులకు గురికాకుండా అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ హితవు పలికారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయాన్ని పెంపొందించుకుని పంటల క్రయవిక్రయాలు సాఫీగా జరిగేలా చొరవ చూపాలన్నారు. పంట విక్రయించిన రైతులకు వెంటవెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఎక్కడ కూడా వ్యాపారులు కూడబలుక్కుని ధర తగ్గించారనే ఫిర్యాదులు రాకూడదని, మార్కెట్ డిమాండ్ ను అనుసరిస్తూ రైతులకు పూర్తి స్థాయిలో ట్రేడర్లు ధర చెల్లిస్తున్నారా లేదా అన్నది పరిశీలించాలని అన్నారు. రైతులను మోసగించే చర్యలకు పాల్పడే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ ఏ.డీ గంగవ్వ, ఏ.డీ.ఏలు, ఏ.ఓలు, పసుపు ట్రేడర్లు, విత్తన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



### కాంగ్రెస్ అబద్ధపు
## హామీలతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు

**మొదటి పేజీ తరువాయి...**

4000 వేల రూపాయలకు పెంచుతామని, 1 లక్ష ఉద్యోగాలను 2 లక్షలకు పెంచి ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఎలాంటి కార్యాచరణ చేయలేదని మండిపడ్డారు. విద్యార్థులకు ఫ్రీ స్కూటిలు ఇస్తా అని ఇవ్వకపోగా, చదువుకునే విద్యార్థులకు ఫీ రియంబర్స్ మెంట్ కూడా అమలు కాక విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారని, 317 జీవో విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు విసిగిపోయారని, ఇలా పలు రకాల సమస్యలు ఉన్నాయని, వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని ప్రశ్నించే గొంతుకలై సమస్యల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీయడానికి పట్టబదుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ , బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి , టీచర్స్ ఎన్నికల ఇంచార్జ్ శ్రీనివాస్ , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంకర్ లక్ష్మీనారాయణ , నాయకులు కొండ ఆశన్న, బిజెపి జిల్లా టీచర్స్ సెల్ కన్వీనర్ రణదీష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## అదృశ్యమైన తల్లీకూతురు

**గురువారం తిరిగి ఇంటికి వచ్చిన వైనం..**

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 20.** కామారెడ్డి జిల్లా దోమకొండలో తల్లి కూతుళ్లు అదృశ్యమైన సంఘ టన దోమకొండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.స్రవంతి తెలిపిన వివరాల ప్రకారాం.. దోమకొండకు చెంది న నర్రాగుల కళావతి(40), నర్రాగుల భవాని (14)సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని తెలిపారు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడం తో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ విషయమై గురువారం ఎస్సై స్రవంతిని వివరణ కోరగా తల్లి కూతురు ఇంటికి తిరిగి వచ్చారని చెప్పారు. కుటుంబ తగాదాలే కారణమని సమాచారం.

## చత్రపతి శివాజీ విగ్రహాని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి



**ప్రజా జ్యోతి జుక్కల్ ఆర్సీ ఫిబ్రవరి 20** జుక్కల్ మండలంలో డోన్గావ్, శక్తినగర్ చౌరస్తాలో ఉన్నా చత్రపతి శివాజీ విగ్రహం 8వ తారీఖు నాడు గుర్తు తెలియని దుండగులు ద్వసం చేసి విగ్రహాన్ని మురికి కాలువలో పారవేయడం జరిగింది.పోలీసులకు వారిపైన చర్య తీసుకోవాలని కంప్లీట్ ఇవ్వడం ద్వారా పోలీసులు విచారణ చేపట్టి ఆ దుండగులను గురువారము రోజున పట్టుకోవడం జరిగింది.వారు ఐదుగురు ఇతర మతస్తులు ఉద్దేశపూర్వకంగా హిందూ మతాల మనోభావాలు దెబ్బతీయాలని ఉద్దేశంతో ముస్లిం మతస్తులైన వారు ఐదుగురు కలిసి నిర్ణయించుకొని పగడిబందీగా ప్లాన్ ప్రకారం విగ్రహాన్ని ద్వశం చేసి ఎత్తుకెళ్లి మురికి కాలువలో పడేయడం జరిగింది.ఇలాంటి నీచ నికృష్ట ఆలోచనతో మతల మధ్య చిచ్చులు పెడుతున్న ఇలాంటి ఉగ్రవాదులను ఊరుకునే ప్రసక్తే లేదు ఇకనైనా ఎవరైనా హిందువు దేవాలయాల జోలికి, హిందూ విగ్రహాల జోలికి వస్తే ఊరుకునేది ఖబర్దార్ బిడ్డలారా పోలీస్ శాఖకు ధన్యవాదాలు తెలుపుతూ ఉద్దేశపూర్వం చేసిన చత్రపతి శివాజీ విగ్రహం పగలగొట్టి ఎత్తుకెళ్లిన వారిని పట్టుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు . అంతేకాకుండా ఈ దుండగులను చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఇంకెప్పుడు ఎవరు ఇలాంటి పని చేయాలంటే ఈ శిక్ష చూసి భయపడాలని కోరారు.

# సమ్మె అనివార్యమైన సందర్భం

## నేడు జరిగే ఒక గంటసేపు సమ్మెను విజయవంతం చేద్దాం !




**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 20.** ఒక కార్మిక సంఘం తమ సంస్థలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని దేశవ్యాప్తంగా సమ్మెకు దిగడం చాలా అరుదైన ఘటన. సంస్థ భవిష్యత్తు పట్ల ఎంతో అవగాహనా, అంచనా ఉంటే తప్ప ఇలాంటి పిలుపు నివ్వడం సాధారణంగా జరగదు. అంతే కాకుండా, జీతభత్యాలను కోల్పోతూ సంస్థ గురించి, దాని భవిష్యత్తు అవసరాల గురించి ఆలోచించడమంటే ఎంతో లోతైన సైద్ధాంతిక నిబద్ధత ఉంటే తప్ప సాధ్యం కాదు. ఈరోజు ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 'ఒక గంట' సమ్మె జరుగనున్నది. ఎల్ఐసి ఆఫ్ ఇండియాలో బేస్ క్యాడర్స్ అయినటువంటి క్లాస్ 3,4 ఉద్యోగాల నియామకాలు వెంటనే చేపట్టాలని ఈ సమ్మె జరుగనున్నది. సంస్థల్లో నియామకాలు చేపట్టడం కోసం ఒక కార్మిక సంఘం సమ్మెకు పిలుపునివ్వడాన్ని దేశంలోని సోదర కార్మిక సంఘాలన్ని హర్షిస్తున్నాయి..సంస్థ పట్ల ఇలాంటి నిబద్ధత అందరికీ ఉండాలని కోరుకుంటున్నాయి. దేశభక్తి ప్రాధాన్యత కలిగిన ఈ సమ్మెలో పాలుపంచుకోవడానికి ఉద్యోగులంతా సిద్ధమయ్యారు. సంస్థ భవిష్యత్తు అవసరాలకోసం యువరక్తాన్ని సాధించే క్రమంలో చిన్న చిన్న త్యాగాలకు వెనుకాడకుండా దేశవ్యాప్తంగా సమ్మె సైరన్ మ్రోగింది. ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రారంభమైన నేపథ్యంలో, బీమా చట్ట సవరణల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఇదే సందర్భంలో మరియు ఇన్సూరెన్స్ రంగంలో 100% ఎఫ్‌డీఐలను అనుమతించాలనుకున్న కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయ కాలంలో ఈ సమ్మె ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నది..కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలు, ఐఆర్‌డీఏఐ నేల విడిచి చేస్తున్న సంస్కరణల పరంపరలో ఎల్ఐసి మేనేజ్‌మెంట్ సంస్థ భవిష్యత్తుకు కావాల్సిన యంత్రాంగాన్ని సమకూర్చడంలో సోయిదప్పి పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది..అంతే కాకుండా క్లాస్ 3,4 ఉద్యోగాల నియామకాల పట్ల పూర్తిగా అలక్ష్యం ప్రదర్శిస్తున్నది. ఈ నేపథ్యంలో బాధ్యత కలిగిన మరియు ప్రభుత్వ రంగ పరిరక్షణే ప్రధాన సిద్ధాంతంగా ఏర్పడిన కార్మిక సంఘం – ఏఐఐఈఏ, ఉద్యోగాల నియామకాల ప్రక్రియను సాధించే పోరాటాన్ని తన భుజాన వేసుకుంది. దానికి చట్టబద్ధమైన మార్గం సమ్మెనే అని నమ్మి ఉద్యోగులను పురమాయించింది..కోల్పోయేది కాస్తంత వేతనమే కావచ్చు కానీ తమను తాము ఉద్దండులుగా భావిస్తున్న వారి కళ్లు తెరిపించడానికి ఇది ఎంతో దోహద పడగలదు. ఏ సంస్థకైనా శిక్షితులైన సిబ్బంది ప్రధాన భూమిక పోషిస్తారు.. అందుచేతనే, లాభాపేక్ష లేని మరియు జీత భత్యాల ఆధారంగా మాత్రమే పని చేయగలిగే పర్మనెంట్ ఉద్యోగుల ద్వారా సంస్థలను నిర్వహించాలని ఏనాడో భారత పార్లమెంట్ నిర్ణయించింది..కానీ బాధ్యతలను పూర్తిగా విస్మరించే ప్రపంచీకరణ సరళీకరణ పరిణామాల అనంతర కారణాల వల్ల అవుట్సోర్సింగ్ పెరిగిపోతోంది..దాని ద్వారా నాణ్యత మరియు అకౌంటబిలిటీ కూడా సన్నగిల్లుతున్నాయి..ఇన్సూరెన్స్ ఒక దీర్ఘకాలిక కాంట్రాక్ట్. అంతే కాకుండా, కాంట్రాక్ట్ (ఒప్పందం) కుదుర్చుకున్న వ్యక్తి కన్నా వారి వారసులకు నమ్మకంతో బదులివ్వాల్సిన జవాబుదారీతనం వుండవలసిన వ్యవస్థ..ఇలాంటి చోట పర్మనెంట్ మరియు సరైన విద్యార్హతలు కలిగిన ఉద్యోగులను క్రమం తప్పకుండా నియమిస్తూ ఉండడం వల్ల సంస్థ దినదినాభివృద్ధి సాధించగలుగుతుంది.. ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగాల కొనసాగింపుకు, పర్మనెంట్ ఉద్యోగ నియామకాలకు మరియు ఉమ్మడి బేరసారాలకు పూర్తిగా విరుద్ధమైన ఆలోచనలతో సాగుతున్నది..ఇది చాలా ప్రమాదకరం..అందుచేత ఈ రోజు జరిగే ఒక గంట సమ్మె డిమాండ్ల లో ఉమ్మడి బేరసారాల హక్కు కల్పించడానికి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కు గుర్తింపు ఇవ్వాలని కూడా ఉన్నది . 'ఒక కార్మిక సంఘానికి గుర్తింపు' అంటే అది ఆ సంస్థలోని ఉద్యోగులందరికీ తమ వాదనను వినిపించుకోగల వేదిక అన్న మాట..ఏ సంఘానికి లేదా ఎవరికి గుర్తింపు ఉన్నదన్నది ముఖ్యం కాదు..అలాంటి ప్రక్రియ ఒకటుంటూ సంస్థలో ఉంటే అది అందరికి మేలు కలుగగల అవకాశం..ఉద్యోగులకు యాజమాన్యానికి అనుసంధానకర్తగా వ్యవహరించే మెజారిటీ కార్మిక సంఘానికి గుర్తింపు ఉభయ తారకమే అవుతుంది..అంతే కాకుండా, ప్రభుత్వం గానీ లేదా మేనేజ్‌మెంట్ గాని ఏకపక్ష నిర్ణయాలకు పోకుండా ఉమ్మడి బేరసారాల ద్వారా బహుళ ప్రయోజనాలకై యత్నించడంతో పాటు ప్రజోపయోగకరంగా కూడా ఉంటుంది. ఎల్.ఐ.సి సంస్థకు ఎక్కువగా ఆర్థిక భారం పడని 'బేస్ క్యాడర్స్' ఎల్ఐసీ అసిస్టెంట్ మరియు ఎల్ఐసీ సబ్‌స్టాఫ్ ఉద్యోగాల నియామకాలు వెంటనే చేపట్టి, ఎల్ఐసిలోని మెజారిటీ సభ్యులకు నాయకత్వం వహిస్తున్న కార్మిక సంఘం, ఏఐఐఈఏ కు గుర్తింపునివ్వడం ద్వారా సంస్థ ప్రగతికై ఉద్యోగులను క్రమశిక్షణతో ముందుకు నడిపిస్తూ పాలసీదారులకు మరింత సేవలందించి వాటాదారులకు లాభాలు చేకూర్చడమే కాకుండా ప్రభుత్వానికి కూడా కావాల్సిన నిధులను సమకూర్చే మార్గం నిరంతరాయంగా కొనసాగగలదు. ఈ విషయంలో ఇంకెంతమాత్రం తాత్సారం చేయకుండా ఎల్ఐసి మేనేజ్‌మెంట్ ఉద్యోగ నియామకాలను చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం సముచితం..ప్రభుత్వం కూడా తగిన విచక్షణతో సానుకూలంగా అనుమతిని ఇవ్వగలదని ఆశిద్దాం.

# కాలభైరవ స్వామిని దర్శించుకున్న సినీ హీరో శ్రీకాంత్



**రామారెడ్డి ఫిబ్రవరి 20 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలో ఈసన్నపల్లి రామారెడ్డి గ్రామాలలో కొలువై ఉన్న దక్షిణ కాశి గా పిలవబడుతున్న శ్రీ కాలభైరవ స్వామిని సినీ హీరో శ్రీకాంత్ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బహులాష్టమి సందర్భం శ్రీకాంత్ ఉమామహేశ్వరి స్వామి వారికి కూష్మాండ దీపం మరియు స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ప్రభు రామచంద్ర , పూజారులు శ్రీనివాస్ శర్మ , వంశీ కృష్ణ శర్మ,జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ సిబ్బంది నాగరాజు, భాను, తదితరులు పాల్గొన్నారు.





# మైనర్ బాలికపై అత్యాచారయత్నం

**రామారెడ్డి ఫిబ్రవరి 20 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన గుజ్జుల నవీన్ అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారం చేసిన ఘటన చోటు చేసుకుంది (8 సంవత్సరాలు) బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు, ఎస్సై నరేష్ ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ప్రాథమిక విచారణ కొనసాగుతోంది అని తెలిపారు.



### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

## వై అశోక్ కుమార్‌కి సిపిఎం మద్దతు

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 20.** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎన్నికల్లో టీచర్ గా పనిచేసి రిటైర్మెంట్ అయిన నిరాడంబరంగా జీవిస్తున్న వై అశోక్ కుమార్ కి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నాం మిగతా ఇద్దరు అభ్యర్థులు కూడా ఒకరు రియల్ ఎస్టేట్ వ్యాపారి మరొకరు ప్రవేట్ విద్యాసంస్థల అధిపతి వీరు వీరి ప్రయోజనాల కోసం వ్యాపారాల కోసం వస్తున్నారు. తప్ప ప్రభుత్వ విద్యా విధానం పకడ్బందీగా అమలు కోసం ఉద్యమించేందుకు కాదన్నారు కాబట్టి నిజాయితీగా ఉండే అశోక్ కుమార్ గారిని గెలిపిస్తే ఓటు వేసిన మనకు విలువ ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ గౌడ్ మూతి రామ్ నాయక్ కొత్త నరసింహులు పాల్గొన్నారు.



## ఐఏఎస్ అధికారిని అంటే ఇలా ఉండాలి!

### బాన్సువాడలో

### వినబడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మై పేరు:!

**(ప్రజా జ్యోతి) బాన్సువాడ. ఫిబ్రవరి 20.** కామారెడ్డి జిల్లా, బాన్సువాడ పరిదిలో గల బొర్లం సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో తరచూ ఏదో ఒక సంఘటన జరుగుతున్న క్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి , అక్కడ స్టే చేసి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఇకపై బాలికల విషయంలో ఉపాధ్యాయులు గాని ఇంకెవరైనా గాని ఎలాంటి ఇబ్బందులకు గురి చేసిన, సంరక్షణ విషయంలో కానీ, మెనూ విషయంలో కాని, ఎలాంటి నిర్లక్షం వహించిన ఊరుకునేది లేదన్నారు.వారికి కన్నబిడ్డల్లగా చూసుకోవాలని అన్నారు. ఇకపై పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తానని , ఎవరికైనా ఏ సమస్య ఉన్న నిర్భయంగా ఫిర్యాదు బాక్స్ లో లిఖితపూర్వకంగా కంప్లైంట్ చేయెచ్చు అన్నారు.సబ్ కలెక్టర్ కిరణ్మయి .. ఎప్పుడూ, ఎక్కడ ,ఏ డిపార్ట్మెంట్, ఎ శాఖలను ,తనిఖీ చేస్తుందోనని, అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది.ఒకవేళ విజిట్ సమయములో, పొరపాట్లు జరిగినట్లు మేడం దృష్టికి వస్తే , సస్పెండ్ చేస్తానన్నారు.

# వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి





## జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**ఎల్లారెడ్డి ఫిబ్రవరి 20 (ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ వేసవిలో తాగునీటికి ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో గురువారం తాగునీటి సరఫరాపై మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బి డబ్ల్యూ, మిషన్ భగీరథ, పన్నుల వసూళ్లు, పారిశు ద్ధ్యంపై, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి మరమ్మతులు వేసవి కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో వార్డులలో ఎలాంటి తాగునీటి కొరత లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే తక్షణమే పరిష్కరించాలన్నారు. వారి స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజు నిర్వహించాలని స్వీకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించాలని తెలిపారు. డంపింగ్ యార్డ్ లో సిగ్రిగేషన్ షెడ్ లో సెగ్రిగేట్ చేయాలని తెలిపారు. పారిశుధ్య సిబ్బందికి విత్తనాలు సక్రమంగా ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలన్నారు. మిషన్ భగీరథ అమృత్ పథకం కింద చేపడుతున్న పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ఆర్డీఓ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ రమేష్, తహసీల్దార్ మహేందర్, ఇన్చార్జి ఎంపీడీవో ప్రకాష్, పలు శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

### మర్చి 2న యూపీఎస్ యుద్ధభేరి టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షులు కుంట ఎల్లారెడ్డి

**నాగిరెడ్డిపేట్, ఫిబ్రవరి 20 (ప్రజాజ్యోతి):** వచ్చేనెల రెండున ఏకీకృత పెన్షన్ పథకం (యూపీఎస్)ను వ్యతిరేకిస్తూ యుద్ధభేరి కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షులు కుంట ఎల్లారెడ్డి తెలిపారు.అందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్,యూపీఎస్ వద్దనీ,ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలని యూపీఎస్‌తో ఉద్యోగులకు సామాజిక భద్రత ఉండబోదని పేర్కొన్నారు కేంద్రం ప్రభుత్వం తెస్తున్న కొత్త పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పాత పెన్షన్ విధానాన్నిఇప్పటికే మహారాష్ట్ర,ఒడిశా రాష్ట్రాలలో ఏప్రిల్ 01 తేదీ నుండి అమలు చెయ్యడానికి ప్రభుత్వాలు ఒప్పుకున్నాయన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన




హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కంట్రిబ్యూషన్ విధానాన్ని రద్దుచేయాలని కోరారు .మార్చ్ 2న యూపీఎస్‌పై యుద్ధభేరి పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు జిల్లాలోని ఉద్యోగులు,ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల భాధ్యులు అవినాష్ ,వినీల్ కుమార్,అరవింద్, సంఘమేశ్వర్, కిష్టయ్య, అనిల్,ఉదయం,రవిందర్,సతీష్, సంతోష్ తదితరులు పాల్గోన్నారు.

# అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 20.** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుర్జాల్ గ్రామానికి చెందిన సొప్పరి మాణిక్యం వయసు 40 సంవత్సరాలు గారు తనకున్న వ్యవసాయ పొలంలో రెండు బోర్లు వేయగా పడకపోవడంతో, అలాగే దుబాయ్ కి వెళ్లి వచ్చినా గాని అతను చేసిన అప్పులు తీరకపోవడంతో, చేసినా అప్పులు ఎలా తీర్చాలని మనోవేదన గురి అయ్యి నిన్న ఉదయం 10 గంటలకు తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి, తూలుతూ వస్తుండగా అది గమనించిన అతను కొడుకులైన సంగమేశ్వర్ మరియు సందీప్ లు మాణిక్యం నీ కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి కి, తీసుకువెళ్లగా అక్కడి నుండి సికింద్రాబాద్లోని గాంధీ హాస్పిటల్ కి తరలించగా చికిత్స పొందు నిన్న రాత్రి 10 గంటలకు చనిపోయినాడు. భార్య సొప్పరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనైనది

# సోయా కొనుగోలు పునః ప్రారంభం

## ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు



ప్రజా జ్యోతి జుక్కల్ ఆర్సీ ఫిబ్రవరి 20 గత కొన్ని రోజుల క్రితం మద్నూర్ వ్యవసాయ మార్కెట్ లో కొనుగోలు కేంద్రం మూత పడటంతో సోయా బీన్ ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి.. దాదాపుగా ఎనిమిది వేల క్వింటాళ్ల ధాన్యం మిగిలిపోవడంతో సోయా రైతులు ఆందోళన చెందడం జరిగింది.. ఆరుగాలం శ్రమించి పంట పండించి,ధాన్యాన్ని అమ్ముకోవడానికి మార్కెట్ కు తీసుకెళ్తే.. ఆ పంటను కొనుగోలు చేయకపోతే రైతులు పడే బాధ ఎలా ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చు.ఎద్దు ఏడ్చిన ఎవుసం - రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుంది.అందుకే ఈ విషయం నా దృష్టికి వచ్చిన వెంటనే రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు దగ్గరకు రైతులను తీసుకెళ్లి పరిస్థితి వివరించి,మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇవ్వడం జరిగింది.అయినా అక్కడితో ఆగకుండా.. దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లి అక్కడ వ్యవసాయ శాఖ సహాయ మంత్రిని,కార్యదర్శిని సంబంధిత అధికారులను కలిసి సోయా కొనుగోలు చేపట్టాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.వారు కూడా సానుకూలంగా స్పందించినప్పటికీ..ఎటువంటి ఫలితం రాలేదు.ఎలాగైనా సోయా ధాన్యాన్ని కొనుగోలు చేయించి రైతుల కళ్ళల్లో ఆనందం నింపాలని దృఢ నిశ్చయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పరిస్థితి వివరించి అన్నదాతలను ఆదుకోవాలని కోరడం జరిగింది..రైతు బిడ్డ, రైతు బాంధవుడు అయిన ముఖ్యమంత్రి వెంటనే మిగిలిన సోయా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.దాని ఫలితంగా ఇప్పుడు సోయా కొనుగోళ్లు పునః ప్రారంభం కాబోతున్నాయి.. మిగిలిన సోయా ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుంది.చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేయించే బాధ్యత నాది మీరు నిశ్చింతగా ఉండండి అన్నారు.రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని తెలిసిన వెంటనే వారికి అండగా నిలబడాలని, అన్నం పెట్టే అన్నదాతలను ఆదుకోవాలనే గొప్ప మనసు కలిగిన మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకు జుక్కల్ నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# గుండెపోటుతో విద్యార్థిని మృతి



కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 20. కామారెడ్డి పట్టణంలో పాఠశాలకు బయలుదేరిన విద్యార్థిని ఒక్కసారిగా గుండెపోటుతో రోడ్డుపై పడిపోయి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. రామారెడ్డి మండలం సిగరాయిపల్లి గ్రామానికి చెందిన శ్రీనిధి (14) కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. విద్యార్థిని పెద్ద నాన్న కామారెడ్డి పట్టణంలోని కల్కినగర్ కాలనీలో నివాసం ఉండగా అప్పుడప్పుడు పెద్దనాన్న ఇంటి వద్దే ఉండి పాఠశాలకు వస్తుంటుంది. ఎప్పటిలాగే కల్కినగర్ నుంచి నడుచుకుంటూ పాఠశాలకు వస్తుండగా జీవధాన్ స్కూల్ వద్ద ఒక్కసారిగా గుండెపోటుతో కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే పాఠశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే హార్ట్ బీట్ కొట్టుకోవడం ఆగిపోయింది. అయినా వైద్యులు సీపీఆర్ చేసి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. శ్రీనిధి మృతితో అటు సింగరాయిపల్లి గ్రామం, ఇటు పాఠశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. చదువు విషయంలో శ్రీనిధి ముందంజలో ఉండేదని, మంచి విద్యార్థినిని తాము కోల్పోయామని పాఠశాల ప్రిన్సిపాల్, తోటి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి





## జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

ఎల్లారెడ్డి ఫిబ్రవరి 20 (ప్రజా జ్యోతి) విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల,జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. డైనింగ్ హాల్ కు వెళ్లి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం పై ఆరా తీశారు. పాఠశాలలో ఉన్న సమస్యలపై ప్రిన్సిపాల్ కు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు కలెక్టర్కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ముచ్చటించారు. కలెక్టర్ విద్యార్థులతో శనిటేషన్ పోస్టర్ ను గణితం, ఫిజిక్స్, సైన్స్ కు సంబంధించిన వాటిపై అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు చక చక సమాధానాలు చెప్పారు. దీంతో విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని. గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం కూడా శాతం ఉత్తీర్ణత శాతం సాధించాలని తెలిపారు. పరీక్షలో విద్యార్థులు ఒత్తిడికి లోని కాకుండా చూడాలని, వచ్చే సంవత్సరం ట్రిబుల్ ఐటీ లో సీటు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ రమేష్, తహసీల్దార్ మహేందర్, ఎంఈఓ వెంకటేశం, ప్రిన్సిపాల్ సావిత్రి, ఇన్చార్జి ఎంపిడిఓ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ డైరీ ఆవిష్కరణ

కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 20. కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ వి. విక్టర్ తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బాపు రావు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రసాద్ ఆధ్వర్యంలో డైరీ ని ఆవిష్కరించారు. సందర్భంగా తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బాపురావు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు నిరంతరం కష్టపడి పని చేస్తున్నారన్నారు. తెలంగాణ పోరాటంలో ప్రజలను నాయకులను ఏకం చేసి రాష్ట్ర సాధనకు సైతం కృషి చేశారన్నారు. అన్ని వర్గాలను ప్రజల ను మమేకం చేస్తూ ప్రజల కోసం నిరంతరం ఐఎఫ్ డబ్ల్యూ జె అనుబంధంతో టీజేయు జర్నలిస్ట్ యూనియన్ కొనసాగుతుం దన్నారు. 2025 సంవత్సర డైరీ ఆవిష్కరించడం సంతోషంగా ఉన్నన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా యూనియన్ సభ్యులు గోపాల్, శ్రీకాంత్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నారాయణ, రవి నాయక్, శ్రీకాంత్, పాల్గొన్నారు.



# సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 20. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం ను ఆయన ప్రారంభించారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వివరాలను తెలుసుకున్నారు. పట్టణంలో పలువురు దాతలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాలు ఎంత ఎక్కువగా ఉంటే పట్టణం అంత ప్రశాంతంగా ఉంటుందన్నారు. అనంతరం పలువురు దాతలను ఐజీ సన్మానించారు. ఎస్పీ సింధుశర్మ, ఏఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

